

# భారతీయ సినిమాల్లో స్త్రీమూర్తులు

వారాల ఆనంద్



ఈ రోజుల్లో ఐతే చాలా సినిమాల్లో స్త్రీ పాత్రలు కేవలం ఆటబొమ్మలుగా ఉంటున్నాయి కానీ దశాబ్దాలుగా వచ్చిన ఇండియన్ సినిమాని పరిశీలిస్తే స్త్రీ పాత్రలకి పెద్దపీట వేసిన సినిమాలు ఎన్నో ఉన్నాయి. అన్ని భారతీయ భాషలనుంచీ స్త్రీ పాత్రలని ప్రధానంగా చిత్రీకరించిన ఉత్తమ సినిమాల పరిచయాలు .. నెలకి రెండు సినిమాల చొప్పున.

కళాత్మక చిత్రాభిమాని ఆనంద్‌గారు కవి, డాక్యుమెంటరీ చిత్ర నిర్మాత, దర్శకులు కూడ. ఒక కవితా సంపుటిని, సినిమాల మీద నాలుగు పుస్తకాలని రచించారు. కళాత్మక చిత్రోత్సవాల నిర్వహణలో విశేషానుభవం ఉంది. **varalaanand**@hotmail**.com**

## నిమజ్జనం

**భాష:** తెలుగు; **స్క్రీన్‌ప్లే, దర్శకత్వం** - బి.ఎస్.నారాయణ; **నటీనటులు** - శారద(భారతి), బోసుబాబు (శ్రీకాంత్)

**విడుదల:** 1979



తెలుగు చిత్ర రంగంలో వాస్తవవాద దృక్పథంతో సినిమాలు నిర్మించి జాతీయ స్థాయిలో గుర్తింపును అందుకున్న అతి కొద్దిమంది దర్శకుల్లో బి.ఎస్.నారాయణ ఒకరు. ఆయన తన నలభై ఏళ్ళ సినీరంగ ప్రస్థానంలో 32కు పైగా చిత్రాలకు దర్శకత్వం వహించినప్పటికీ అందులో అత్యధిక శాతం వ్యాపార చిత్రాలే.

హెచ్.వి.బాబు, కె.బి.తిలక్, కె.ఎస్.ప్రకాశరావులాంటి దర్శకుల వద్ద అసిస్టెంట్‌గానూ, అసోసియేట్‌గానూ పనిచేసిన బి.ఎస్.నారాయణ 1960 తర్వాత తానే స్వీయదర్శకత్వ బాధ్యతలు నిర్వహించడం ఆరంభించారు. శ్రీదేవి, పెళ్ళినాటి ప్రమాణాలు లాంటి చిత్రాలు నిర్మించిన ఆయనే తన రెండు చిత్రాల్లో కథాంశంలోనూ, చిత్రనిర్మాణ సరళిలోనూ వాస్తవాలకు దర్శకత్వం

వహించారు. ఈ రెండు చిత్రాలు రాష్ట్ర జాతీయ స్థాయిల్లో బహుమతులు గెల్చుకున్నాయి. విమర్శకుల్నించి మంచి మన్ననల్ని అందుకున్నాయి.

ఆయన 'నిమజ్జనం' జాతీయ అవార్డుతో పాటు, పనోరమా ఎంట్రీని, అందులో నటించిన శారదకు జాతీయ ఉత్తమ నటి 'ఊర్వశి' అవార్డును గెలుచుకుంది. 'నిమజ్జనం' స్త్రీని ముఖ్యాభినేతగా చేసి నిర్మించిన చిత్రం. ఇందులో భారతీయ స్త్రీ సెక్సుపరంగా హింసకు గురయినప్పుడు, రేప్ చేయబడినప్పుడు ఆమె వేదన, అతలాకుతలమయిన ఆమె జీవితమూ శీలం పోయిందన్న వ్యధ, మాములు జీవితం జీవించలేనేమోనన్న భావన వీటన్నిటి పర్యవసానంగా గంగలో కలిసిపోయి 'నిమజ్జనం' అయిన ఆమె మానసిక, శారీరక సంఘర్షణ ఈ చిత్రంలో మౌలికాంశ. 'అత్యాచారం' అనే ఒక సామాజిక హింసకు బలయిన స్త్రీ జీవన వ్యధ ఈ చిత్రం.

నిజానికి ఎవడో చేసిన 'నేరానికి' మన సమాజం బాధితురాలిపైనే అప్రకటితంగా తీవ్రమయిన శిక్ష వేస్తుంది. ఈ 'అత్యాచారం'లో పురుషరాజకీయాలున్నాయి. స్వార్థాలున్నాయి. స్వంత ఆస్థిగా భావించే ఆలోచనలున్నాయి. అంతేకాదు తన ప్రమేయం లేకుండా పశుబలానికి, పశువాంఛకి ఫలితంగా జరిగిన అత్యాచారం వల్ల తన శీలం పోయిందని తన భర్తకి తన కుటుంబానికి తీవ్రమయిన అన్యాయం జరిగిపోయిందనే భావజాలాన్ని స్త్రీల ఆలోచనల్లోకి బాగా చొప్పించిందీ సమాజం. తన ప్రమేయం లేకుండా జరిగిన హింసకు తనెలా బాధ్యత వహిస్తాననే ఆలోచన రాకుండా తను మలినమయిపోయానని, తనకు ప్రాయశ్చిత్తం జరగాలనే తీవ్రమయిన ఆలోచనా ధోరణి కలిగేందుకు ఈ సమాజం చాలా జాగ్రత్తగా స్త్రీ చుట్టూ ఓ భావజాల వలయాన్ని సృష్టించింది. దాని ఫలితంగానే అత్యాచారం జరిగినప్పుడు బాధ్యుడయిన పురుషులు అత్యధిక శాతం రొమ్ము విరుచుకుని తిరగడం. బాధితురాలయిన స్త్రీ ఆత్మార్పణ చేసుకున్న సందర్భాలూ మనకు కనిపిస్తాయి. సరిగ్గా అలాంటి అంశాన్నే ఇరుసుగా చేసుకుని బి.ఎస్.నారాయణ 'నిమజ్జం' నిర్మించారు. అయిఏ 'రేప్'ని సామాజిక రాజకీయ కోణంలో కాకుండా వ్యక్తిగత కోణంలోంచి విశ్లేషించి కుహనా విలువల్ని విశ్లేషిస్తాడు దర్శకుడు. అంతేకాకుండా చివర్లో రేప్‌కు బాధ్యుడయిన పురుషుడిలో కూడా పరివర్తన చూపించి అతడు కూడా చనిపోయేలా చూపించి సంస్కరణాంశాన్ని ప్రాయశ్చిత్తాంశాన్ని ముందుకు తెస్తాడు. సామాజిక ఆధిపత్యాంశాల్ని విడిచి వ్యక్తిగత పరితాపాన్ని ఫోకస్ చేసి మౌలికమయిన విలువల అంశాన్ని వదిలేసి దర్శకుడు నిరాశనే కలిగిస్తాడు. కానీ సినిమాను నడిపించిన తీరులోనూ, చిత్రీకరణలోనూ చూపించిన మెళకువలు 'నిమజ్జనాన్ని' మంచి చిత్రంగానే నిలిపాయి.

చిత్ర కథాంశం విషయానికి వస్తే తన తండ్రి అస్థికలు గంగలో కలపడానికి శ్రీకాంత్ తన భార్య భారతితో కలిసి కాశీకి బయలుదేరతాడు. పల్లెగుండా ప్రయాణం చేసి కొంత అడవి లాంటి ప్రాంతాన్ని దాటితేగాని రైల్వే స్టేషన్‌కు చేరుకోలేని స్థితివారిది. అందుకే ఎడ్లబండిలో బయలుదేరతారు. ప్రయాణపు బడలికలో భర్త ఒడిలో పడుకున్న భారతి సౌందర్యాన్ని చూసి బండివాడు గోవిందులో కలవరం కలుగుతుంది. ఆమెను అనుభవించాలనే ఆలోచనలూ పెరుగుతాయి. బండి చక్రపు ఇరుసుకు కట్టిన అస్థికల మూట కనిపించడం లేదని గోవిందు హఠాత్తుగా చెప్పేసరికి శ్రీకాంత్ హతాసుడవుతాడు. బండి దిగి వెనక్కి పరుగు తీస్తాడు. భారతి కూడా అతన్ని అనుసరించబోతే వృధాగా మీరెందుకు శ్రమ పడడమని బండివాడు వారిస్తాడు. మూటను వెతుక్కుంటూ శ్రీకాంత్ వెనక్కి వెళ్ళింతర్వాత గోవిందు తన పశుబలంతో భారతిపై అత్యాచారం జరుపుతాడు. శ్రీకాంత్ తిరిగి వచ్చేసరికి మాములుగా ఉండిపోతాడు గోవిందు. భారతి మాత్రం నిర్లిప్తంగా ఉదాసీనంగా కనబడుతుంది. శ్రీకాంత్ అడుగుతాడు ఏమయిందని, ఆమె ఏమీ చెప్పకుండా నిర్లిప్తంగా ఉండిపోతుంది. ఆమె మౌనంగా కాశీ చేరుతుంది. కాశీలో నిమజ్జనం శాస్త్రయుక్తంగా చేస్తారు. శ్రీకాంత్‌తో పాటు గంగలో మునిగిన భారతి పైకి లేవదు. గంగలో కలిసిపోతుంది. శ్రీకాంత్ హతాశుడవుతాడు. తీవ్రంగా గాలిస్తాడు. కానీ భారతి నీటిలో మునిగిపోయి కనిపించదు. భార్యను పోగొట్టుకున్న శ్రీకాంత్ దుఃఖంతో తిరుగు ప్రయాణమవుతాడు. రైలు దిగగానే బండివాడు గోవిందుకు విషాదవార్తను చెబుతాడు. గోవిందులో పశ్చాత్తాపం చెలరేగుతుంది. తాను చేసిన అత్యాచార ఫలితమే భారతి మరణమని

తలచి దుఃఖపడతాడు. శ్రీకాంత్‌ని ఊరు తిరిగి తీసుకెళుతూ గోవిందు చనిపోతాడు. టూకీగా ఇదీ కథ. ఇందులో చిత్రీకరణ అత్యంత రియలిస్టిక్‌గా ఉంటుంది. సంభాషణలు అతి తక్కువగా ఉండి సినిమా అధికశాతం దృశ్యపరంగానే సాగుతుంది.

భారతి పాత్రలో శారద అత్యున్నత నటనని ప్రదర్శించింది. రేప్‌ని వ్యక్తిగత, మానసిక కోణంలోంచి చర్చించిన వాస్తవవాద సినిమా 'నిమజ్జనం' తెలుగు చిత్ర చరిత్రలో ఓ మైలురాయి. ●●●

## లేఖయుదె మరణం ఒరు ఫ్లాష్ బ్యాక్

**భాష** – మలయాళం; **ఫోటోగ్రఫీ** – షాజీ ఎన్ కరుణ్; **సంగీతం** – ఎంవి. శ్రీనివాసన్; **కథ స్క్రీన్‌ప్లే, దర్శకత్వం** – కె.జి జార్జి, **నటీనటులు** – నళిని, శుభ, ముమ్మట్టి, గోపి

**విడుదల:** 1983

**సినిమా నిర్మాణం ఆరంభం** అయినప్పటి నుంచీ అది అత్యంత ఆకర్షణీయ కళారంగమే. వెలుగు జిలుగుల నడుమ మిలమిల మెరుస్తూ కనిపించే ఆ రంగం పట్ల ఆకర్షితులు కావడం అత్యంత సహజం. కానీ పరమపదసోపానంలాంటి ఆ రంగంలోకి అడుగిడి అత్యున్నత స్థానం అందుకున్న వారు కొద్దిమందే ఉంటే దయనీయమయిన అనుభవాలు ఎదురై జీవితంలో ఓటమి పాలయిన వారే అధికం. అయితే అలా ఉన్నతస్థానం పొందిన వారు ఎదగడానికి పడ్డ శ్రమ, ఎదుర్కొన్న చెదుఅనుభవాలూ అన్నీ ఇన్నీ కాదు. ఆ మెరుపుల వెనకాల పొంచి ఉన్న చీకటి వారనుభవించే ఒంటరితనమూ, దుఃఖమూ బయటకు కనిపించవు. అందులోనూ సినిమారంగంలో నటీమణులుగా ఎదిగిన స్త్రీలు ఎదుర్కొనే అనుభవాలు అమితమయినవి.




పితృస్వామ్య భావజాలం రాజ్యమేలుతున్న వర్ధమాన సమాజంలో స్త్రీ వినియోగ వస్తువుగా చూడబడుతోంది. సినిమా రంగంలో ఆ పరిస్థితి మరింత తీవ్రమయిన రూపంలో కొనసాగుతుంది. అక్కడ స్త్రీ ఒక మనిషిగా కంటే విలాస వస్తువుగానే చూడబడుతూ ఉందన్నది వాస్తవం. అక్కడ నటీమణికి కూడా మనసుంటుందని ఆమె మనిషేననే విషయాన్ని పక్కన పెట్టి ఆమె గ్లామరు, ఆమె సంపాదన, ఆమె యవ్వనం మాత్రమే ప్రధానమవుతాయి. ఆ స్థితిలో ఆమె చుట్టూరా ఉన్న కుటుంబమూ, స్నేహితులూ, తోటి కళాకారులూ అంతా దాదాపు ఒకే రకంగా ప్రవర్తిస్తారు. వాటన్నింటి నుంచి భిన్నంగా ఆమె మనసుకోసం, తోడుకోసం సొంతం అనిపించే ఓ నీడ కోసం పరితపిస్తుంది. కానీ సర్వత్రా మోసాన్ని స్వార్థాన్ని ఎదుర్కొన్న నటీమణులు తన జీవితాన్నే చాలించిన సంఘటనలూ సినీరంగంలో ఉన్నాయి. మన తెలుగు చలన చిత్ర రంగం అందుకు భిన్నంగా ఏమీలేదు.

అలా సినిమారంగంలోని చీకటి వెలుగుల్ని సృష్టిస్తూ వెలువడ్డ పాకుడు రాళ్ళు, సినీ జనారణ్యంలాంటి నవలలు మనకున్నాయి. అల్లాగే మరాఠీ నటి జీవితాన్ని ఆధారం చేసుకుని శ్యాంబెనగల్ నిర్మించిన 'భూమిక' లాంటి గొప్ప చిత్రాలు వచ్చాయి.

అదే రీతిలో మధ్యేవాదిగా (మిడిల్ సినిమా వాది) పేరుగాంచిన కె.జీ.జార్జి ఓ వాస్తవ సంఘటనను ఆధారం చేసుకుని ఓ చిత్రం నిర్మించారు. ఓ నటీమణి మద్రాసులో కాలుపెట్టిన నాటినుంచి నటిగా ఎదిగిన క్రమం అందుకోసం ఆమె పడ్డ కష్టాలు, ఎదుర్కొన్న స్వార్థాలు చివరగా ఓ స్నేహహస్తం కోసం, ప్రేమించే మనిషి కోసం తపించి తన జీవితాన్నే చాలించిన ఆమె జీవిత కథే "లేఖాయుదె

మరణం ఒరు ఫ్లాష్ బ్యాక్''. చలన చిత్ర నిర్మాణపరంగా గొప్ప చిత్రమేమీ కాకపోయినప్పటికీ ఓ సామాజిక సమస్యని చర్చించిన చిత్రంగా 'లేఖాయుదె మరణం ఒరు ఫ్లాష్ బ్యాక్' మిగిలిపోతుంది.

అప్పటికే 'స్వప్నదానం' సినిమాతో జాతీయ అవార్డును అందుకున్న జార్జి 1983లో 'లేఖా..' చిత్రం నిర్మించారు. టెక్నిక్ పరంగా ఈ చిత్రంలో కథ యావత్తూ ఫ్లాష్ బ్యాక్ లోనే నడుస్తుంది. ఎలాంటి సమస్య లేకుండా కథనం సాఫీగా సాగిపోతుంది.




లేఖ ఓ మళయాళీ సూపర్ స్టార్. ఆమె మద్రాసులో చనిపోతుంది. ఆమె అంతిమ యాత్రకు వేలాది మంది అభిమానులు ఉప్పెనలా హాజరవుతారు. శవయాత్ర సాగుతూ ఉంటుంది. ఓ కామెంటేటర్ చెప్పడం మొదలుపెడతాడు. ఆ నటి ఆత్మహత్య చేసుకుందేమోనంటాడు. ఆ మరణాన్ని అర్థం చేసుకోవడానికి, ఆమె అర్థాంతర మరణ కారణాల్ని తెలుసుకోవడానికి చిత్రం క్రమంగా ఫ్లాష్ బ్యాక్‌లోకి వెళుతుంది.

తాగుబోతయిన ఫణిక్కర్, భార్యా కూతురుతో కేరళ నుంచి మద్రాసు చేరుకుంటాడు. అందగత్తె అయిన భార్య విశాలమ్ కూతురు శాంతమ్మను సినిమా నటిని చేయాలనుకుంటుంది. తమకు పరిచయమున్న ఓ అసిస్టెంట్ డైరెక్టర్ పాల్‌రాజ్‌ని సంప్రదిస్తుంది. తాను త్వరలో తీయబోయే సినిమాలో శాంతమ్మకి మంచి పాత్రను ఇస్తానని పాల్‌రాజ్ ప్రామిస్ చేస్తాడు. వారు ఉండేందుకు ఓ స్థలం కూడా చూపిస్తాడు. వారిని ఓ సినిమా జర్నలిస్టు కారటూర్‌కు పరిచయం చేస్తాడు. పాల్‌రాజ్ సినిమా మొదలు కాకపోవడంతో విశాలం కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడిపోతుంది. ఫణిక్కర్ విసుగు చెంది స్వంత ఊరుకు వెళ్ళిపోతాడు. రామప్పన్ అనే తార్పుడుగాడు విశాలం, లేఖలను ధనవంతుల చెంతకు తీసుకెళ్ళడం ఆరంభిస్తాడు. ఆర్థికంగా వారి స్థితి మెరుగుపడుతుంది. వారిద్దరూ మంచి ఇంటికి మారుతారు. అన్సారీ అనే ప్రొడక్షన్ మేనేజర్ లేఖకు మంచి పాత్రను సంపాదిస్తాడు. అలా సినీరంగ ప్రవేశం చేసి లేఖ క్రమంగా ఎదుగుతుంది. ఆమె ప్రగతికి ఓ కేబరే డాన్సర్ పుష్ప స్నేహం కడు ఉపయోగపడుతుంది.

అప్పటికే మలయాళీ ఈ చిత్రసీమలో సూపర్ స్టార్‌లా వెలుగొందుతూ ఉన్న ప్రేమసాగర్ లేఖని ప్రోత్సహిస్తాడు. ఆమె పరిస్థితి మెరుగుపడుతుంది. సాగర్ ప్రోత్సాహంతో ఆమె విజయవంతమయిన హీరోయిన్‌గా నిలుస్తుంది. బెల్లం చుట్టూ ఈగలు ముసిరినట్టుగా ఆమె చుట్టూరా బంధువులు వచ్చి చేరతారు. ఊరు వెళ్ళిపోయిన తండ్రి తిరిగి వస్తాడు.

ఇంతలో కళాత్మక చిత్రాల దర్శకుడు సురేష్ బాబు లేఖకు తన చిత్రంలో మంచి పాత్రనిస్తాడు. దానికి ఆమెకు జాతీయ స్థాయి అవార్డు లభిస్తుంది. వారిద్దరి నడుమా స్నేహం పెరుగుతుంది. తన భార్యతోనూ, కుటుంబంతోనూ అసంతృప్తి ఉన్న సురేశ్ లేఖకు మరింత దగ్గరవుతాడు.

మరోవైపు విశాలం ఆశలకు అంతే లేకుండా పోతుంది. మరింత డబ్బుకోసం లేఖ ఇంకా ఎక్కువ చిత్రాల్లో నటించాలని ఆమె వత్తిడి తెస్తుంది. మొదటి రోజుల్లో తమని ఆదరించిన మిత్రుల పట్ల కూడా ఆమె ఆదరంగా ఉండదు.

వీటన్నింటి మధ్య తీవ్ర మానసిక క్షోభకు గురైన లేఖ సురేశ్‌బాబుతో వేరుగా ఉందామంటుంది. వేరుగా ఉంటారు. వారి సంబంధం సురేశ్‌కి చెడు ప్రచారం కల్పిస్తుంది. అయినా ఆమె లెక్కచేయదు. కానీ సురేశ్ భార్య కొడుకు అతనిపై తీవ్రమైన వత్తిడి తెస్తారు. సురేశ్ లేఖను విడిచి వెళ్ళిపోతాడు. లేఖ పరిస్థితి అర్థం చేసుకున్న కేబరే డాన్సర్ పుష్ప ఆమెను ఓదారుస్తుంది. ఇంటికి తిరిగి వెళ్ళమని ఉద్బోధిస్తుంది. కానీ లేఖ తీవ్రమైన మానసిక క్షోభకు గురై దుఃఖపడుతుంది. పుష్ప నుంచి సమాచారం తెలుసుకున్న విశాలం

ఆమె భర్త లేఖ ఇంటికి వస్తారు. అన్ని తలుపులు కిటికీలు మూసి ఉంటాయి. ఓ కిటికీ బద్దలుకొట్టి లోపలికి చూస్తూ సీలింగ్‌కు వేలాడుతూ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న కూతురు లేఖ కనిపిస్తుంది.

తల్లి అత్యాశకూ, ప్రియుడు సురేశ్ అవకాశవాదానికి, సినీ జనారణ్యంలో ఆమె మనిషిగా కంటే యంత్రంలాగా చూడబడటాన్ని భరించలేని లేఖ ఈ లోకాన్ని విడిచి వెళ్ళిపోతుంది. ఆమె జీవితం సినిమా రంగంలో నటిగా ఎదగాలనుకున్న అనేక మంచి యువతుల వాస్తవానుభవాల కూడలిగా కనిపిస్తుంది. డబ్బుతో, డబ్బుచేత, డబ్బుకోసం రూపొందిన వ్యాపార ప్రపంచంలో ఇమడలేని ఓ గొప్ప కళాకారిణి ఇతివృత్తమే ఈ చిత్రం.

అయితే ఈ చిత్రంలో సినిమాటిక్ దృశ్య పరంపరకంటే మెలోడ్రమటిక్ దృశ్యాల కొనసాగింపు కనిపిస్తుంది. పాత్రల మానసికావిష్కరణల కంటే సంఘటనల కూర్పులా సాగుతుంది. మొత్తం మీద ఓ చలనచిత్ర నటి జీవితంలో ఎదుర్కొన్న అనుభవాల్ని ఈ చిత్రం మన ముందుంచుతుంది.

●●●

Click here to share your comments on this article.